

మంత్రి నాగార్జునకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సోమవారం తిరుపతికి విచ్చేసిన రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డాక్టరు మెరుగు నాగార్జునకు ఆంధ్రప్రదేశ్ బిషఫ్ కౌన్సిల్ చైర్మన్ డాక్టరు ఎలమంచిలి ప్రవీణ్ పుష్పగుచ్ఛం అదించి, దుశ్వాలవతో ఘనంగా స్వాగతం పలికారు. రేణిగుంట విమానశ్రయంలో మంత్రికి స్వాగతం పలికిన వారిలో ఎం.జీవతర్నం రెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, దేవసహాయం, తదితరులు పాల్గొన్నారు.

కాలువను కాస్త..

కయ్యగా మార్చాడు..!

- చేమూరులో ఓ టీడీపీ నేత నిర్వాకం
- చెక్ డ్యామ్‌ను సైతం పూడ్చి బోరేసిన వైనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :

అదో తెలుగుగంగ ఎస్కేప్ కాలువ.. సుమారు 7.5 కిలోమీటర్ల పొడవు, 100 అడుగుల వెడల్పు ఉన్న అతిపెద్ద కాలువ.. సుమారు రెండువేల ఎకరాలకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సాగునీరందిస్తున్న బహత్తర కాలువ.. అయితే ఆ కాలువనే చెరబట్టి కయ్యగా మార్చేశాడు ఓ టీడీపీ నాయకుడు. అంతేనే ఎస్కేప్ ఛానల్ గుండా నీళ్లు ఏటి పారకాకుండా చూసేందుకు నిర్మించిన రెండు చెక్ డ్యామ్‌లను పూడ్చి పవర్ బోరు వేశాడా ప్రబుద్ధుడు. ఆయన దర్జాగా కాలువను ఆక్రమించి, బోరు వేసి వీలుచిక్కినప్పుడల్లా పంటలు సాగు చేస్తుంటే అటు ఇరిగేషన్ అధికారులు కానీ, ఇటు రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. వివరాల్లోకి వెళితే...

పొలంగా మారిన ఈదల కాలువ

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం చెమూరు రెవెన్యూ పరిధిలో ఈదల కాలువ ప్రవహిస్తోంది. సుమారు 7.50 కిలోమీటర్ల పొడవు, 100 అడుగుల వెడల్పుతో ఈ కాలువ సొంతం. పిల్లమేడుకు సమీపంలోని తెలుగు గంగ కాలువ నుంచి వచ్చే అదనపు నీటిని దారి మళ్ళించి స్వర్ణముఖి నదిలో కలపడం ఈ కాలువ ముఖ్యఉద్దేశం. ఈ క్రమంలో ఈ కాలువ గుండా వచ్చే నీటి ద్వారా సమీప గ్రామాలైన చేమూరు, చియ్యవరం తదితర గ్రామాల్లో రైతులు సుమారు రెండు వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఆ ప్రాంత రైతులకు మరింత కాలం సాగునీరందించేలా ఇరిగేషన్ అధికారులు పిల్లమేడు తిప్ప సమీపంలో రెండు చెక్ డ్యామ్‌లను నిర్మించారు. ఒక్కో చెక్‌డ్యామ్ విలువ సుమారు రూ.12లక్షల పై మాటే. ఈ చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి ఇంకా పూర్తిస్థాయిలో బిల్లులు కూడా చెల్లించలేదు. ఇదిలా ఉంటే చేమూరు గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత ఈ కాలువపై కన్నేశాడు. అదును చూసి కాలువలోకి చొచ్చుకొస్తూ పొలంగా మార్చేసుకున్నాడు. అడ్డుగా ఉన్న చెక్‌డ్యామ్‌లను పూడ్చేసి బోరు వేసేశాడు. ఇక్కడ మతలబ్ ఏంటంటే..!! కాలువ భూమిని ఆక్రమించి, చెక్ డ్యామ్‌లను పూడ్చివేసి సదరు వ్యక్తి బోరు వేస్తే, రెవెన్యూ, మండల పరిషత్, విద్యుత్ శాఖాధికారులు అవేమీ చూడకుండా విద్యుత్ సర్వీస్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. లక్షలు పెట్టి చెక్‌డ్యామ్‌లను పూడ్చి వేసినా ఇరిగేషన్ శాఖాధికారులు పట్టించుకోకపోవడం మరింత దురదష్టకరం. ఫలితంగా రెండు వేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమైక్య ఉద్యమాలతోనే..

కార్మిక హక్కుల సాధన

పర్సా సత్యనారాయణ శతజయంతి సభలో సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు హేమలత

ప్రజాశక్తి - తిరుపతి: సమైక్య ఉద్యమాలతోనే కార్మికుల హక్కుల సాధన సాధ్యమవుతుందని సిఐటియు అఖిలభారత అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత పేర్కొన్నారు. తిరుపతిలోని రామ తులసికళ్యాణ మండపంలో సోమవారం సాయంత్రం సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "ఆధునిక పరిశ్రమలు కార్మిక వర్గంపై ప్రభావం" అనే అంశంపై సభను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన హేమలత మాట్లాడుతూ... సమాజాన్ని మార్చాలని దోపిడీని అంతం చేయాలన్న లక్ష్యంతో 72ఏళ్ల పాటు సుదీర్ఘకాలం పోరాటాన్ని కొనసాగించి తన జీవితాన్ని కార్మికవర్గం కోసం అంకితం ఇచ్చిన ఉ ద్యమకారుడు పరస సత్యనారాయణ గారని ఉద్ఘాటించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధన కోసం కషి చేయడమే ఆయనకు ఇచ్చే నివాళి అని పేర్కొన్నారు. దేశంలో పాలకులు కార్మికుల పొట్ట కొట్టి, కార్పొరేట్ శక్తులకు యదేచ్ఛగా దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. కార్మిక చట్టాలను కాలరాస్తూ లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి,వాటిని అందరికీ వర్తింప చేస్తామంటూ బుకాయిస్తు, కార్మికుల సంక్షేమాన్ని నీరుగార్చాలంటూ వాపోయారు. అత్యధికంగా ఉన్న అసంఘటిత రంగ కార్మికులకు చట్టాలేవి వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన సోషల్ సెక్యూరిటీ కోడ్లు అమలు అయితే లక్షలాదిమంది కార్మికులు రోడ్డు పాలవుతారని అన్నారు. కార్మికులకు సంక్షేమ ఫలాలు అందకుండా, వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని తెలిపారు. వేతనాలు పెంచాలని కోరితే నిర్బంధాలను ప్రయోగించి, కేసులు పెడుతున్నారని వాపోయారు. రాష్ట్రంలో ఆధునిక పరిశ్రమల పేరుతో కార్పొరేట్ సంస్థలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దాసోహం అయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో 80 లక్షల మంది అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, మిడ్ డే మీల్స్ కార్మికులు,ఇతర స్కీం వర్కర్లు ఉన్నారని వారికి వేతనాలు ఇవ్వకుండా గౌరవవేతనాల పేరుతో దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రైవేటు మ్యానుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీల్లో సంఘం పెట్టుకునేందుకు పోరాడాల్సిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. కార్మికులందరూ ఐక్యమై సమైక్య ఉద్యమాలను చేపట్టితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఉద్ఘాటించారు. సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం నిర్వహించడమే పరసా సత్యనారాయణకి ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరావు, సిఐటియు తిరుపతి జిల్లా కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అంటూ నిత్యం ప్రచారం చేసే తిరుమల తిరుపతి దేవస్థానంలో కనీసం మానవత్వం కూడా లేదని విమర్శించారు. రోజు తిరుమలకు వస్తున్న లక్షలాదిమంది యాత్రికుల మలమూత్రాలను శుభ్రం చేసి పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికుల పట్ల కర్కసంగా పాలకులు, అధికారులు ప్రవర్తిస్తున్నారని వాపోయారు. రోజుకు 670 రూపాయల కనీస వేతనం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చిన కలెక్టరే... దాన్ని అమలు చేయాలని కోరిన కార్మికుల పట్ల కనికరం లేకుండా ప్రవర్తించారని గుర్తు చేశారు. రోజుకు 200 రూపాయలు ఇస్తున్న టీటీడీ అధికారులు పాలకమండలి తీరును నిరసించిన పాపానికి కార్మికులపై కేసులు పెట్టి నిర్బంధాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవడం చూస్తుంటే ఇంతకంటే సిగ్గుచేటు విమర్శించారు. 940రోజులు పాటు దీక్షలు చేస్తున్న అటవీ కార్మికుల గోడు అధికారులకు వినపడలేదా అంటూ ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం, రాష్ట్ర నాయకులు సుబ్బరావమ్మ, బీ రాణి, నేతలు జి.వెంకటేశం, ఏ.పుల్లయ్య, వాణిశ్రీ, ఆర్.లక్ష్మి, కెఎన్ఎన్ ప్రసాద్ రావు, నాగ వెంకటేష్ పాల్గొన్నారు.

రాజకీయాల్లోకి రావడం తథ్యం

పది రోజుల్లో రాజకీయ ప్రకటన చేస్తా : ప్రముఖ హీరో సప్తగిరి

ప్రజాశక్తి- తిరుపతి సిటి: తాను రాజకీయాల్లోకి రావడం తథ్యమని, టిడిపి నుంచి తనకు పిలుపు వచ్చిన మాట వాస్తవమేనని, పది రోజుల్లో తన రాజకీయ ప్రకటన చేస్తానని ప్రముఖ కమెడియన్, హీరో సప్తగిరి తెలిపారు. తాను రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నాని వెల్లడించారు. తనకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అంటే చాలా కాలంగా అభిమానం అని, తనను రాజకీయాల్లోకి ప్రవేశించాలని, చిత్తూరు జిల్లాలో తన అరంగ్రటం చేయాలని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు నుంచి పిలుపు వచ్చిన మాట వాస్తవమేనని, ఇటీవల పాదయాత్రలో నారా లోకేస్‌ను కూడా కలిశానని, ఇదేమి దాపరికం కాదన్నారు. చిత్తూరు జిల్లా వాసైన నేను 250 రూపాయలతో హైదరాబాదుకు వెళ్లి, నేడు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి, సినీ అభిమానుల అశీస్సుల వల్లేనన్నారు. తాను సినిమారంగంలో ఉన్నా, రాజకీయ రంగంలో ఉన్నా కష్టాన్ని ఎప్పుడికి మరిచిపోనన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల ఎదుగుదలకు ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశ్యంతోనే రాజకీయాల్లోకి వస్తున్నానని పేర్కొన్నారు. మరో పది, 15 రోజుల్లో తన రాజకీయ ప్రకటనను చేస్తానని, పార్టీలో అధిష్టానం మాట ప్రకారం నడుచుకుంటానని తెలిపారు. తాను రాజకీయాల్లో ఉన్నా సినీరంగాన్ని వదలనని, తనకు పేరు తెచ్చిన కళామాతల్లికి ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. అభిమానులను ఎప్పుడు కడుపుబ్బ నవ్వించేందుకు ఇష్టపడుతానని, త్వరలో తాను నటించిన గోల్డ్‌మెన్ చిత్రం విడుదలవుతుందన్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిందని, జూలైలో విడుదల కావచ్చన్నారు. ఇందులో నూటికి నూరుశాతం అబిమానులను నవ్వించేలా పాత్రలు ఉన్నాయని, ఈ చిత్రం అందరికి తప్పకుండా నచ్చుతుందని, విజయం సాధిస్తుందని ఆశాబావం వ్యక్తం చేశారు. గోల్డ్‌మెన్‌ను ప్రతి ఒకరు ఆదరించాలని కోరారు.

హంగ్రీ కియా పుడ్‌కోర్టును ప్రారంభించిన హీరో సప్తగిరి

తిరుపతి బైరాగిపట్టెడలో నూతనంగా ఏర్పాటు చేసిన హంగ్రీ కియా పుడ్‌కోర్టును ప్రముఖ కమెడియన్, హీరో సప్తగిరి సోమవారం ప్రారంబించారు. నూతన రెస్టారెంట్ వద్దకు చేరుకున్న ఆయనకు అబిమానులు, రెస్టారెంట్ యాజమాన్యం బాణాసంచా పేల్చి, పుష్ప గుచ్ఛాలందించి ఘనంగా స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన, పూజా కార్యక్రమంల అనంతరం ఆయన అభిమానులనుద్దేశించి మాట్లాడుతూ నూతన హంగులతో నేటి తరానికి అనుగుణమైన రుచులు అందించిడానికి హంగ్రీ కియా పుడ్ కోర్టును డాక్టరు రణదీర్ చోలరాజు, డాక్టరు వాసుదేవ సంయుక్తంగా ఏర్పాటు చేశారన్నారు. వీరు తనకు స్నేహితులని, ఇప్పటికే బైరాగిపట్టెడలో సారా హాస్పిటల్ ఏర్పాటు చేసి, ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారన్నారు. రణదీర్‌కు హోటల్ రంగంపై ఆసక్తి ఉండేదని, ఆ విషయాన్ని తనకు గతంలోనే చెప్పాడన్నారు. ఇప్పుడు బైరాగిపట్టెడలో హంగ్రీ కియా పుడ్‌కోర్టును ఏర్పాటు చేయడం అబినందనీయమన్నారు. ఇందులో ఎక్కడక లేని రుచులు, పుడ్‌వెరైటీలు ఉన్నాయన్నారు. పూనె నుంచి రప్పించిన మాస్టర్స్‌తో నేటి ఆరోగ్య స్తితిగతులను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన డిష్‌స్ అందిస్తారన్నారు. ఒక డాక్టరు హోటల్ రంగంలోకి వెళ్లితే ఎలాంటి ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తారో అందరికి అర్థమవుతుందన్నారు. తాను పూర్తి శాఖకారినని, కానీ ఇక్కడ మాంసాహారాలు కూడా ఉన్నాయని, తన స్నేహితులు వీటిని తిని బాగా ఉన్నాయని కితాబు ఇచ్చారన్నారు. మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుని నాణ్యమైన ఆహారాన్ని అతి తక్కువ ధరకు అందించేందుకు రణదీర్ పూనుకోవడం అబినందనీయమన్నారు. ఇక్కడ పుడ్ బాగా లేద చెబితే అలాంటి వారి బిల్లును నేనే స్వయంగా చెల్లిస్తానని, ఇక్కడ వంటకాలు అంత రుచికరంగా ఉంటాయని కొనియాడారు. కార్యక్రమంలో మధురాయల్, పలువురు ప్రముఖులు, వైద్యులు, సప్తగిరి అభిమానులు పాల్గొన్నారు.

అలసత్వం సహించేది లేదు: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాలవ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్థవంతంగా పరిష్కారం చూపాలని, అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డికే.బాలాజీతో కలసి కలెక్టర్ స్పందన, గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. అలాగే ఇంఛార్జి డీఆర్‌ఓ కోదండ రామిరెడ్డి, ఎస్‌డిసిలు భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. స్పందన ఆన్లైన్ నమోదుతో రసీదులు అందించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు 80, పోలీస్ శాఖ 9, జిల్లా రిజిస్టర్ కార్యాలయం 1, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం 1, ఇరిగేషన్ శాఖ 2, ఈడి బిసి కార్పొరేషన్ 1, జిల్లా పంచాయతీ కార్యాలయం 2, డీఈఓ రెసిడెన్షియల్ 1, ఏపిఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ 12, పిడిడిఆర్ డిఏ 5, పిడి డ్వామా 3, మున్సిపల్ కమిషనర్ 2, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ 1, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ 1, ఈడి ఎస్‌టి కార్పొరేషన్ 1, ఎస్‌ఈ ఆర్‌అండ్ బి 1, స్కిల్ డెవలప్మెంట్ 1 కలిపి మొత్తం 132 వినతులు రావడం జరిగిందన్నారు.

బాలికలు ఉన్నతస్థాయికి ఎదగాలి

విద్యాకానుక పంపిణీ చేసిన కలెక్టర్

విద్యార్థినికి విద్యా కానుక అందజేస్తున్న కలెక్టర్ వెంకట రమణారెడ్డి

ప్రజాశక్తి- రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని, ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అన్నారు. సోమవారం రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యాక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పన్నాడు జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి జగనన్న విద్యాకానుక పంపిణీని చేపట్టారని తెలిపారు. నేటి నుంచి ఈనెల 19వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్కూల్స్‌లో జగనన్న విద్యాకానుక పంపిణీ చేపట్టడం జరుగుతుందన్నారు. మొదటి రోజు నుంచే విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్‌లో కూడా లేని వసతులను ప్రభుత్వ పాఠశాల్లో కల్పించడం జరుగుతోందని విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని బాగా చదివి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈనెల 15వ తేదీన నియోజకవర్గస్థాయిలో, 17వ తేదీని జిల్లా స్థాయిలో పది పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన మొదటి, రెండవ, మూడోవ స్థానాల్లో నిలిచిన 937 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగేశం, జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధనం, ఎంఈవో ఇందిరాదేవి, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు అనుమతితో అంతర్గత బదిలీలు

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ధర్మకర్తల మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉద్యోగుల అంతర్గత బదిలీలన్నీ ధర్మకర్తల మండలి అనుమతితోనే జరగాలని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక ఆలయ పరిపాలనా సోమవారం ధర్మకర్తల మండలి సర్వసభ సమావేశం నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు సమావేశానికి అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆలయ అభివద్ధికి సంబంధించి 48 అభివద్ధి పనులపై చర్చించి ఆమోదం తెలిపారు. సువర్ణముఖి నదిని పవిత్రంగా ఉంచడానికి మురుగునీరు పైప్‌లైన్ ద్వారా తరలించే పథకానికి ఆమోదం తెలిపినట్లు తెలిపారు. ప్రోటోకాల్ విఐపిలకు నిర్దిష్ట సమయంలో దర్శనం ఏర్పాటు చేసే అంశాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టనున్నామని చెప్పారు. స్థానిక భక్తులకు ప్రతిరోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు అంతరాలయ దర్శనం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రధాన ఆలయంలో లీకేజీ నివారణకు సంబంధించి మూడు కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, దాత సహకారంతో ఈ పనులు చేయనున్నట్లు తెలిపారు. గిరిప్రదక్షిణ మార్గంలో సోలార్ లైట్లు ఏర్పాటు, ప్రతి పౌర్ణమికి గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పన తదితర అంశాలను ఆమోదం తెలిపినట్లు చెప్పారు. హరిత అభివద్ధి పథకంలో ప్రస్తుతం పనిచేస్తున్న వారి వయసు 50 ఏళ్ళు పైన పడటంతో వారు ప్రస్తుతం చేస్తున్న విధులకే పరిమితం చేసి, మరో 25మందిని హరిత అభివద్ధి కోసం తీసుకోనున్నట్లు వివరించారు. ధర్మకర్తలమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టకుంటే పట్టా రద్దు..

- జగనన్న గృహ లబ్ధిదారులపై అధికారుల ఒత్తిడి - అయోమయంలో ప్రజలు

జగనన్న కాలనీలో పునాదులకే పరిమితమైన ఇళ్లు

ప్రజాశక్తి- గూడూరుటౌన్: వెంటనే ఇంటిని నిర్మించుకోండి.. లేకుంటే మీ పట్టాను రద్దు చేస్తాం.. అంటూ జగనన్న గృహలబ్ధిదారులపై అధికారుల ఒత్తిళ్లు తీసుకువస్తుండటంతో ప్రజలు అయోమంలో పడ్డారు. గూడురు అర్బన్‌లో సుమారు 3,857 మందికి జగనన్న ఇళ్లు మంజూరయ్యాయి. అందులో ఇప్పటివరకూ సుమారు 332 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, మరో 225 ఇల్లు రూఫ్ లెవెల్ వరకు వచ్చాయి. మరో 268 ఇల్లు గోడల వరకు వచ్చాయి. అదేవిధంగా 1749 ఇల్లు బేస్‌లతో ఆగి ఉన్నాయి. మరో 1149 ఇళ్లకు పునాదులకే పరిమితమయ్యారు.

జగనన్న కాలనీలో సరైన సౌకర్యాలు లేకపోవడం కూలీల కొరత, గృహనిర్మాణ సామాగ్రి ధరలు విపరీతంగా పెరగడంతో ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం ఇచ్చే డబ్బు సరిపోవడం లేదు. కట్టినవాటికీ బిల్లులు రాకపోవడం వంటి కారణాలతో మిగిలిన వారు ఇళ్ల నిర్మాణంపై ఆసక్తి చూపడం లేదు. కొన్ని కాలనీల్లో వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజీ, వీధి కుళాయిలు తదితర కనీస సదుపాయాలు కూడా లేవు. వర్షం వస్తే ఇక మొత్తం బురదమయం. దీంతో లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవాలా...వద్దా..? అనే అయోమయంలో పడ్డారు. దీంతో వారి పరిస్థితి ముందు నుయ్యి... వెనుక గొయ్యి అన్న చందంగా మారింది.

సౌకర్యాలు కల్పిస్తాం...

- షబ్బీర్, హౌసింగ్ ఏఈ

కాలనీలో తగిన సౌకర్యాలు కల్పిస్తాం. ప్రతిఒక్కరూ ఇల్లు నిర్మించుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. ఇల్లు కట్టుకోకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.



గూడూరులో పునాదుల్లో ఉన్న ఇళ్లు

ఉత్తమ బోధనకు కేరాఫ్ 'మాతృశ్రీ టెక్నో స్కూల్'

- ఐఐటిలోను సీట్లు సాధించిన విద్యార్థులు
- దీర్ఘానుభవంతో ప్రత్యేక పర్యవేక్షణ
- ప్రతిసారి పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ

2013 పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సుధాకర్ నాయుడు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): పాఠశాలను ప్రారంభించి 33ఏళ్లు అనుభవం కలిగి నాటి నుండి మేటిగా తిరుపతి నగర ప్రజలకు మారుతున్న విద్యాప్రమాణాలతో నాణ్యమైన విద్యను బోధించి విద్యార్థుల ఉన్నత లక్ష్యాలకు బాటలు వేస్తోంది మాతృశ్రీ టెక్నో స్కూల్. దీర్ఘానుభవం గల పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.సుధాకర్ నాయుడు కాలానుగుణంగా విద్యారంగంలో వస్తున్న మార్పులను అనుసరించి తమ పాఠశాల విద్యార్థులకు ఉన్నతవిద్యను అందించడంలో సఫలీకతం అయ్యారు. తిరుపతి నగరంలోని రైల్వేకాలనీలోని తమ పాఠశాలలో 33ఏళ్ల ప్రస్థానాన్ని ప్రజాశక్తితో ఆయన పంచుకున్నారు.

గత 33ఏళ్ల క్రితం ఈపాఠశాలను ప్రారంభించినప్పుడు పదుల సంఖ్యలో విద్యార్థులు పాఠశాలలో అడ్మిషన్లు పొంది నేడు చాలామంది విద్యార్థులు వారు ఎన్నుకున్న లక్ష్యాలను చేరి జీవితంలో స్థిరపడ్డారని ఇది చాలా సంతోషించదగ్గ విషయమని చెప్పారు. నిరంతర శ్రమతో, అకుంఠిత దీక్ష, ఉత్తమ ప్రణాళికలతో పోటీ విద్యారంగంలో రాణించడం కఠోర కార్యచరణతో కూడుకున్నదని, పాఠశాల విద్యార్థులు వారి లక్ష్యాలను చేరువఅవ్వాలని దఢ సంకల్పంతో పనిచేస్తున్నామని సుధాకర్ నాయుడు స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణతను సాధిస్తున్నామన్నారు. మాతృశ్రీ టెక్నో స్కూల్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో బాలబాలికలకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. తాము పాటిస్తున్న విద్యా ప్రమాణాలు చూసి పాఠశాల సమీప ప్రాంతాల నుండి కూడా విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా రవాణా సౌకర్యం కోసం మినీ బస్సులను నడుపుతున్నామన్నారు. పాఠశాల పూర్వవిద్యార్థులు సిద్ధార్థ, తోషన్ కుమార్ ఐఐటిలో సీట్లు పొందారన్నారు. ఈ ఏడు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో జి.నీరజ 591మార్కులు, 580కి పైగా ఆరుగురు విద్యార్థులు సాధించారన్నారు.

సాంప్రదాయాలతో పాటు క్రమశిక్షణ..

తమ పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు మన సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేయడానికి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. చిన్నతనం నుండే విద్యార్థులలో మంచి లక్షణాలను అలవర్చుకునేలా తగిన క్రమశిక్షణ పద్ధతులను పాఠశాలలు తప్పనిసరిగా పాటించవలసిందిగా విద్యార్థులకు చెబుతాము. విద్యార్థులు అవలంభిస్తున్న క్రమశిక్షణపై ఏదేని లోపాన్ని గ్రహించిన వెంటనే వారిని పిలిచి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుంది.

టెక్నాలజీ వినియోగం...

నేడున్న విద్యాప్రమాణాలు రాబోయే రోజుల్లో పూర్తిగా టెక్నాలజీతో మనిషి జీవితం ముడిపడి ఉంటుందని, అంతేకాకుండా మంచి ఉద్యోగాలు కూడా ఈ రంగంలోనే రానున్నాయని అనడంలో అతిశయోక్తి లేదు. అందుకని పాఠశాల విద్యాభ్యాసం ప్రారంభం నుండి పదవ తరగతి వరకు అంచెలంచెలుగా కంప్యూటర్ శిక్షణ, స్కిల్ డెవలప్మెంట్, స్పోకెన్ ఇంగ్లీష్ ఇలా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన ప్రతి ఒక్క అంశాన్ని పాఠశాలలో అమలు చేస్తున్నాము.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సందర్భంగా..

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి- కేవీబీపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించిన పోషకాహారాన్ని ఎమ్మెల్యే రుచి చూశారు. మెనూ, విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మెరుగైన పోషకాహారాన్ని తప్పకుండా అందజేయాలని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట కృష్ణయ్యకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న పోషకాహార విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోటరీ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు సొసైటీ ప్రాంతంలో ఉన్న అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవనంలోని మొదటి అంతస్తులో బొమ్మిరెడ్డి రోటరీ కన్వెన్షన్ హాలును మాజీ రోటరీ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్ర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ రోటరీ సభ్యుల సహకారంతో ఈ కన్వెన్షన్ హాలును పూర్తి చేశామన్నారు. తక్కువ ధరతో గూడూరు ప్రజలకు వివాహాలకు, ఫంక్షన్లకు ఈ కన్వెన్షన్ హాలును అద్దెకు ఇస్తామన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ ఛైర్మన్ మునిగిరీష్, బి.దశరథరామిరెడ్డి, శివకుమార్‌రెడ్డి, బాలకష్ణంరాజు, శ్రీనివాసులురెడ్డి, నాగసునీల్, శ్రీధర్‌నాయుడు, అశోక్, సుబ్రహ్మణ్యం, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు డాక్టర్ రోహిణి, జీవని, మైథిలి, స్నేహలత, అనిత, విష్ణు వందన, జమునమ్మ, శశి రేఖ తదితరులు పాల్గొన్నారు.

సుజాత మృతికి నివాళులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్థానిక ఎన్జీవో కాలనీకి చెందిన విశ్రాంత ఉద్యోగి సుజాత సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఎన్జీవో కాలనీకి వెళ్లి మతిచెందిన సుజాత మతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమె ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంతో సేవలు చేశారని తెలిపారు. ఆయన వెంట పుత్తూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, మనోహర్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవులపల్లి అమర్‌కు స్వాగతం

ప్రజాశక్తి-రేణిగుంట: జాతీయ మీడియా సలహాదారుడు దేవులపల్లి అమర్ కు రేణిగుంట విమానాశ్రయంలో సోమవారం ఘనస్వాగతం లభించింది. కుటుంబ సమేతంగా వచ్చిన వీరికి పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

మామిడి రైతులకు మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మామిడి రైతులకు మద్దతు ధర కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి మహేష్ ఆధ్వర్యంలో పుత్తూరు మార్కెట్ యార్డు సెక్రటరీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జ్యూస్ ఫ్యాక్టరీలో రైతులకు కిలో రూ.15.50 చెల్లించాలని తెలిపినా ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం రైతులకు రూ.12 చెల్లించి చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. రైతుల నష్టపోకుండా మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెల్వరాజ్ ఆచారి, రవి పాల్గొన్నారు.

బాపట్లలో శిక్షణకు జడ్పీటీసీ జ్యోతిరెడ్డి

ప్రజాశక్తి-నాయుడుపేట: ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని జడ్పిటిసి సభ్యులకు బాపట్లలోని ఈటీసీలో సోమవారం జరిగిన రెసిడెన్షియల్ ప్రాథమిక శిక్షణ తరగతులకు నాయుడుపేట మండల జడ్పిటిసి సభ్యులు కట్టా జ్యోతి రెడ్డి హాజరయ్యారు. శిక్షణ తరగతుల్లో జడ్పిటిసి సభ్యుల హక్కులు, నిధులు లభ్యత, అభివద్ధి ప్రణాళిక తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నాయుడుపేట జడ్పిటిసి సభ్యులు మాట్లాడుతూ జడ్పిటిసి సభ్యులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులు మండలాన్ని అభివృద్ధి చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు.

ఉపాధి అధికారులను క్రమబద్దీకరించాలి



ప్రజాశక్తి -తిరుపతి అర్బన్: ఉపాధి అధికారులను క్రమబద్ధీకరించాలని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరణారెడ్డికి ఉపాధి హామీ సిబ్బంది విన్నవించారు. తాము 2006 నుంచి కాంట్రాక్ట్ ప్రాతిపదికన గత 17 సంవత్సరాలుగా వివిధ కేడర్‌లలో పనిచేస్తున్నామని.. తమను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో సి.బి సునీల్, ఏపీవో చంద్రశేఖర్‌రాజు, కంప్యూటర్ ఆపరేటర్ల యూనియన్ అధ్యక్షుడు గోవర్ధన్, టి.ఎ అసోసియేషన్ అధ్యక్షులు చలపతి, ఈసీ మునిశేఖర్, డ్వామా కార్యాలయంలో పని చేస్తున్న ప్లాంటేషన్ సూపర్వైజర్ అనిల్, ఏపీవో రాజకుమార్, సి.ఓ లు భాను ప్రకాష్, గోపి, జ్యోతి, ఆచారి, సునీత, రాజకుమార్, ప్రకాష్, ఉపాధి సిబ్బంది సుధాకర్, దేవిక, మంజుల తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తేనే లక్ష్యాలు సాధ్యం

ప్రజాశక్తి-కేవీబీపురం: క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తేనే లక్ష్యాలు సాధ్యమవుతాయని.. విద్యార్థులు బాల్యం నుంచే లక్ష్యం దిశగా అడుగులు వేయాలని.. ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యాభ్యాసం చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం కేవీబీపురంలోని ఏపీ మోడల్ స్కూల్ , జడ్పీ హైస్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయడం ఇదే మొదటిసారని.. రాష్ట్రంలో ప్రతి పేద విద్యార్థి భవిష్యత్తు జగనన్నపై భారం వేసుకున్నారని.. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్‌ర, మండల పార్టీ అధ్యక్షులు, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కష్ణయ్య, జడ్పీటీసీ సభ్యులు మూర్తి మునెమ్మ, సుబ్బయ్య ,స్టేట్ ఉమెన్స్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పాడి వసంతలాల్, బాబుయాదవ్, స్టేట్ ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనంజయులురెడ్డి, తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు రామ్మోహన్‌వర్మ, వైస్ ఎంపీపీలు సరస్వతి, రమేష్, శ్రీనివాసులు, మండల బీసీ కన్వీనర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అగ్రహారం హరిబాబు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట : కోట మండలంలోని కొత్తపట్నం పంచాయతీ పరిధిలో పెద్ద గోవిందుపల్లి జడ్పీ హైస్కూల్‌లో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను సర్పంచ్ ఈదూరు తిరుపాలయ్య, ఉప సర్పంచ్, మాజీ జడ్పీటీసీ ఉప్పల ప్రసాద్ గౌడ్, ఎస్ఎంసీ ఛైర్మన్, సుబ్రహ్మణ్యంల చేతుల మీదుగా అందించారు.ఉపాధ్యాయులు సుబ్బారావు, పీడీ కష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: స్థానిక బైరాగిపట్టెడలోని మహాత్మా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో సోమవారం ఉదయం పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు మురుగన్, వార్డ్ కార్పొరేటర్ తూకివాకం శాలిని మహేష్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో 42 రోజులు వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు సోమవారం పునః ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ మునెయ్య విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు యువశ్రీ మురళీ, సురేష్ బాబు, నాదెండ్ల మురళీ, ప్రసాద్, వేణుగోపాల్, దేవేంద్ర, మాధవీలత, దాసు, లక్ష్మయ్య, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

- ఏ.పార్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు ఆలత్తూరు ఎంపీటీసీ వరలక్ష్మి, పి.వి కండ్రిగ సర్పంచ్ కోటమ్మ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పుత్తేరి కన్వీనర్ కోకిల రమేష్, వైసీపీ నాయకులు ప్రసాద్‌పాల్, రవి, వార్డు మెంబర్స్ లక్ష్మీనారాయణ, రవణమ్మ, వాలంటీర్లు, గహ సారథులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యా కానుకను సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించినట్లు ఎంఈవో

మస్తానయ్య తెలిపారు. మండలంలోని 66 పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందించారు.

నాయుడుపేట: విద్యాభివద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న విద్యా కానుక పేద విద్యార్థులకు వరమని నాయుడుపేట ఎంపీపీ కురుగొండ్ల ధనలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని పూడేరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి శాంతమ్మ, కార్యదర్శులు సాయి కుమార్ వినోద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : స్థానిక ఎన్జీవో కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి విద్యాకానుక కిట్లను మున్సిపల్ వైస్ ఛైర్మన్ జయప్రకాష్. చేతుల మీదుగా సోమవారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి-వెంకటగిరి: ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతున్నామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం లాలాపేట, మొక్కలపాడు, పాలెంకోట గ్రామాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు సమస్యలను అధికారులకు సూచించి అప్పటికప్పుడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, వైసీపీ సీనియర్ నాయకులు కోటేశ్వరరావు, కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సదానందరెడ్డి, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పదవి రాలేదని ప్రభుత్వంపై విమర్శ

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలను మోసం చేశారని, తన సొంత అజెండాతో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని.. తనకు మంత్రి పదవి ఇవ్వలేదని ప్రభుత్వం అభివద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదని.. ప్రజల అకౌంట్లో డబ్బులు వేస్తే సరిపోతుందా..అని అధికార ప్రభుత్వంలో ఉంటూ విమర్శించే పరిస్థితికి ఆనం నారాయణరెడ్డి వచ్చారని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆనం రామనారాయణ రెడ్డిపై విరుచుకుపడ్డారు. ఆయన ప్రభుత్వం సస్పెండ్ చేసిన తర్వాత తెదేపా పార్టీలో చేరకనే ఆ పార్టీ యువగలం చేపట్టిన కార్యక్రమాలకు ప్రజలు ఆహ్వానించడం తన ఆలోచనకే వదిలేస్తున్నామన్నారు. అధికార పార్టీలో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీకి ద్రోహం చేస్తే వారిని జగన్మోహన్ రెడ్డి సస్పెండ్ చేశారని.. సస్పెండ్ చేసిన ముగ్గురిని టీడీపీ చేర్చుకోవడం చూస్తే ఎంతటి నిజాయితీపరులో అర్థమవుతుందన్నారు. తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలియజేశారు.

అక్రమ లేఅవుట్లపై అలుపెరగని పోరాటం

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని తాల్వాయిపాడు గ్రామంలో వ్యవసాయ భూముల్లో భూస్వాములు ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. దీనిపై సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం కలెక్టర్‌కు గ్రామస్థులు విన్నవించారు. డీపీవోతో పరిశీలన చేయించి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఏపీ ఎస్సీ కమిషన్ మెంబర్ రాక!

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఏపీ ఎస్సీ కమిషన్ సభ్యులు చల్లం ఆనంద్ ప్రకాష్ జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి అన్నారు. 13 రాత్రి తిరుపతి పద్మావతి అతిథి గహం చేరుకుని రాత్రి బస చేస్తారు. 14 న ఉదయం 11 గంటలకు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి తిరుమల చేరుకుని బసచేస్తారు. 15 న ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని పాలకొల్లు బయలుదేరి వెళ్లనున్నారు.

శ్రీ పద్మావతి కళాశాలలో అడ్మిషన్ల ప్రారంభం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో 2023-2024 సంవత్సరానికి సంబంధించి ప్రథమ సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. విద్యార్థినులను మెరిట్ ఆధారంగా రోస్టర్ విధానంలో ఎంపిక చేయడం జరిగింది. విద్యార్థినుల ఎంపిక జాబితాను ఆన్లైన్ లో(అడ్మిషన్స్. తిరుమల.ఓ ఆర్ జి) ఉంచడం జరిగింది. ఎన్నికైన విద్యార్థినుల సెల్ ఫోన్లకు మెసేజ్ పంపారు. ఉదయం 9 గంటలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించి ప్రిన్సిపల్ విద్యార్థినులకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ విధానంపై తగు సూచనలు ఇచ్చారు. తితిదే విద్యాధికారి డాక్టర్ ఎం. భాస్కర్ రెడ్డి కౌన్సిలింగ్ ప్రక్రియను తనిఖీ చేసి బాల మందిరం విద్యార్థినులైన 564 మార్కులు సాధించిన మొదటి సీటును పి.వంశిక , 553 తాడిమర్రి రేవతికి కేటాయించారు.

అవినీతి అధికారుల కట్టడికి చర్యలు

ప్రజాశక్తి -గూడూరు: గూడూరు మున్సిపాలిటీలో అవినీతి అధికారులు పెట్రేగిపోతున్నారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. సోమవారం గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట నకిలీ విలేకరులంటూ ఇటీవల జారీ చేసిన ఎన్‌ఓసీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గూడూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సంఘీభావం తెలిపారు. మున్సిపల్ అధికారి వైఖరితో జర్నలిస్టులు రోడ్డు ఎక్కడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. పలు ప్రజాసంఘాలు సైతం జర్నలిస్టుల రిలే దీక్షలకు మద్దతు తెలిపాయి. అటువంటి వారిని కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిధిగా ఉండే జర్నలిస్టులే అధికారుల వెఖరితో రోడ్డుకెక్కిన పరిస్థితిపై ఆయన స్పందించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత త్వరగా ముగింపు పలుకుతామని అన్నారు. గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ మున్సిపాలిటీకి స్పెషల్ ఆఫీసర్ అయినందున వెంటనే చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్, సివిఆర్ కుమార్, చంద్రయ్య, శశి, భారతీయ జనతా పార్టీ నుంచి మనోజ్ కుమార్, బీజేవైఎం నుంచి చిన్న తదితరులు జర్నలిస్టులకు మద్దతు తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు రాఘవేంద్ర ఆదేశాల మేరకు స్థానిక మెయిన్ స్కూల్‌లో బాల కార్మిక నిర్ములన దినోత్సవాన్ని పురస్కరించుకొని గోడ పత్రికలను ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు మురళీకష్ణ, 13వ వార్డు కౌన్సిలర్ భానుమతి చక్రవర్తి చేతుల మీదుగా విడుదల చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలకు నిలిచిపోయి బాల కార్మికులుగా పనిచేస్తూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ వైస్ ఛైర్మన్ సునీల్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగలాపురం: సమాజంలో మార్పు రావాలంటే ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్.ఎస్.పురం హెచ్.ఎం గోపి పేర్కొన్నారు. సోమవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ ఎం మాట్లాడుతూ బాలబాలికలకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వసతులను వివరించారు. సర్పంచ్ కష్ణమశెట్టి, ఉపాధ్యాయులు రంజిత్ కుమార్, చెన్నకేశవులు, భూపాల్, బాబు, వెంకటేశ్వర్లు, కంచి శ్రీదేవి, మోహన్, చిరంజీవి, మునస్వామి, కమ్మర శ్రీదేవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల వాహనాలకు ఫిట్నెస్ తప్పనిసరి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: జిల్లాలోని అన్ని విద్యాసంస్థల వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్, టాక్స్, డ్రైవర్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ తప్పనిసరి అని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయాలని జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా రవాణా కార్యాలయంలో జిల్లాలోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. స్కూల్, కాలేజ్ వాహనాలకు స్పీడ్ లిమిట్ డివైస్‌లను పరిశీంచాలని.. రోజూ విద్యా సంస్థల వాహనాల తనిఖీ తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, కుసుమ, మెడికల్ ఆఫీసర్ పూజ, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కేవీబీపురం: మఠం వద్ద కారు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థుల సహాయంతో గాయపడిన వారిని 108 లో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేవీబీపురానికి చెందిన భాస్కర్, గోపాల్ ద్విచక్రవాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు అదుపు తప్పిఢీకొంది. కేసు విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ లోకనాథం తెలిపారు.

గంజాయి కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: తిరుపతి పట్టణంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు సోమవారం నగరంలో వివిధ ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టారు. ముగ్గురు అనుమానితులను విచారించి వారి నుంచి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఉమాపతి, హరికష్ణ, మదనగోపాల్‌లను తాతయ్యగుంట ఇందిరా మైదానంలో అరెస్టు చేశారు. తిరుపతి అర్బన్ ఎస్పీ ఇన్‌స్పెక్టర్ నాగరాజురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అమరాజలో ఉద్యోగ అవకాశాలు

ప్రజశక్తి -రేణిగుంట: అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకి ఉచిత శిక్షణ ఉపకార వేతనం (స్టైపెండ్)తో పాటు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని కంపెనీ యాజమాన్యం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరరాజా సంస్థ మద్దతుతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2014 లో అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ని చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో స్థాపించబడింది. ఇప్పటి వరకు ఈ సంస్థ నుంచి 13 బ్యాచ్‌లు, 1244 మంది నిరుద్యోగ యువత ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. ఇలా ట్రైనింగ్ పూర్తి చేసుకొన్న 1244 మందికి అమరరాజా సంస్థలో పర్మనెంట్ ఉద్యోగ అవకాశం కల్పించారు. స్కిల్ డెవప్మెంట్ లో 17 బ్యాచ్ ల్లో 1250 మంది నిరుద్యోగ యువత శిక్షణ పొందుతున్నారు. ఇప్పుడు అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో పది, ఇంటర్ చదివిన నిరుద్యోగ యువతీ యువకులకు 31వ బ్యాచ్ అడ్మిషన్స్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ కాలంలో నెలకు రూ.7,500 నుంచి రూ.11,853 వరకు ఉపకార వేతనం (స్టైపెండ్) ఇవ్వబడును. అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 14 పూతలపట్టు ఎంపిడిఓ కార్యాలయంలోని స్త్రీ శక్తి భవనంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9000024919, 9100477371 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తూ.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన బైరాగిపట్టెడ-2 సచివాలయంలోని అమెనిటి సెక్రటరీ సుజనశ్రీ, పోస్టల్ కాలనీ-1 సచివాలయంలోని అమెనెటి సెక్రటరీ గురుప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

రూ.10 లక్షలతో పైపులైను పనులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని జెండామాను వీధి, గేట్ పుత్తూరులో 14 ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలతో జరుగుతున్న పైపులైను పనులను సోమవారం కమిషనర్ కేఎల్ఎం రెడ్డి పరిశీలించారు. జ్ఞానజ్యోతి స్కూల్‌కు ఎదురుగా నిర్మిస్తున్న కొత్త భవనం నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఫిర్యాదు రావడంతో కమిషనర్ పరిశీలించి సూచనలు చేశారు. పట్టణంలో అక్రమ కట్టడాలు ఏవైనా జరిగి ఉంటే వాటిని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

పాస్పోర్ట్ పోయినది

తిరుపతి జిల్లా, గూడూరు టౌన్, ఎగువవీరారెడ్డి పల్లి నివాసి మూడి సుధీర్ కుమార్ S/o సుందరయ్య సంబంధించిన పాస్పోర్ట్ No. M4613973 తేది 10-06-2023 న మా ఇల్లు ఎగువవీరారెడ్డి పల్లి నుండి టవర్‌క్లాక్ సెంటర్‌కి మోటర్ సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యలో పోయినది. ఎవ్వరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

ఇట్లు,
యమ్. సుధీర్ కుమార్, ఫోన్ నెం: 9700669578

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NELLORE
(Application for reference of a Dispute)
Dispute.No. 161 of 2022
M/s. Lakshmi Vaibhav Chit Funds Pvt.Ltd., Nellore Branch, Rep by It's Foreman G.Vamsi Krishna, being authorized person. ... Disputant
Versus
1. Batti Krishnaiah
and 4 other ... Opponents
Notice
To,
Opp-2. **Beemannagari Nandagopal,** S/o **Rama Krishna,** Occ: Jr Asst., TTD Annaprasadam Canteen, R/o D.No.19-44-S10-1419, Bairagipatteda, Tirupathi, Tirupati (Chittoor) Dist.
Opp-3. **Orusundla Sekhar,** S/o **Kesavulu,** Occ: MECH-III, South Central Railway, R/o D.No. 1-83, Thummalagunta, Tirupati, Tirupati (Chittoor) Dist.
Opp-5. **Chitta Mahesh,** S/o **Munuswamy,** Occ: TTD Employee, R/o D.No. 13-266, Rajiv Nagar Colony, Tirupati, Tirupati (Chittoor) Dist.

పై నెంబరున డిస్ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసు లో మీకు నోటీసునిమిత్తం **తే16-06-2023** దికి వాయిదా వేసియు న్నారు.కావున వాయిదా రోజు **ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయంగాగానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో హాజరై ఆక్షేపణలు తెలుపు కోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

కె.నవకోటి, బి.కాం., ఎల్.ఎల్.బి.,
డిస్ప్యూటెంట్ తరపు అడ్వకేట్, గూడూరు.